క్లుప్తంగా

బోరుబావి యజమానిపై చర్య తీసుకోవాలి

దుగ్గొండి: వాల్టా చట్టానికి విరుద్ధంగా బోరు బావి తవ్వి అధికారులు సీజ్ చేసినా.. పట్టించుకోకుండా వినియోగిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని చంద్రయ్యపల్లి గ్రామానికి చెందిన రైతు ఆవాల రవీందర్‌రెడ్డి శుక్రవారం డిమాండ్ చేశారు. రైతు కథనం ప్రకారం.. మల్లంపల్లి గ్రామానికి చెందిన హర్షం రాజయ్య ఆయన వ్యవసాయ భూమిలో వాల్టా చట్టానికి విరుద్ధంగా కొన్ని సంవత్సరాల క్రితం బోరు వేశాడు. నాటి తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డికి ఫిర్యాదు చేయగా ఆయన పరిశీలించి బోర్‌ను సీజ్ చేశాడు. మళ్లీ తహసీల్దార్ మారగానే బోర్‌ను ఓపెన్ చేసి నీరు వినియోగిస్తున్నాడని వాపోయాడు. దీంతో తన వ్యవసాయ బావి ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రస్తుత తహసీల్దార్ సంపత్‌కు పిర్యాదు చేయగా ఆయన సైతం పరిశీలించి బోర్‌ను సీజ్ చేశాడన్నారు. అయినా లెక్క చేయకుండా యథేచ్ఛగా బోర్‌ను వినియోగిస్తున్నాడన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని బాధిత రైతు రవీందర్‌రెడ్డి వేడుకుంటున్నాడు.

ప్రొసీడింగ్ కాపీ అందజేత



వర్ధన్నపేట: వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో నిర్మించనున్న మున్నూరుకాపు కమ్యూనిటీ హాల్‌కు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని గ్రామస్తులకు ఎమ్మెల్యే అరూరి రమేశ్ అందజేశారు. శుక్రవారం మండల, మున్నూరు కాపు సంఘానికి చెందిన నాయకులు హన్మకొండలోని ప్రశాంత్‌నగర్‌లోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే రమేశ్ ప్రొసీడింగ్ కాపీ అందజేయడంతో ఆయనను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉపాధ్యాయులను బాధ్యులను చేయడం సరికాదు

నెక్కొండ: పదో తరగతి హిందీ పేపర్ లీకేజీలో ఉపాధ్యాయులను బాధ్యులుగా చేయడం సరికాదని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రాష్ట్ర కౌన్సిలర్ బానోతు జాన్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ పాఠశాలలో హిందీ పేపర్ లీక్ అయిన ఘటనలో నబియా ముదాహత్ అనే ఉపాధ్యాయురాలికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ముందస్తుగా వేసుకున్న పథకం ప్రకారమే కిటికి వద్ద కూర్చున్న విద్యార్థి ద్వారా పేపర్ బయటకు వచ్చిందని, దీనికి ప్రధానంగా భద్రతా వైఫలమే కారణమన్నారు. ఉపాధ్యాయులరాని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలన్నారు.

ఆర్థిక సాయం



గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం బీజేవైఎం ఆధ్వర్యంలో గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోదాసి చిన్న సెక్యూరిటీ గార్డుకు సైకిల్ కొనుగోలుకు అవసరమైన ఆర్థిక సాయం అందించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, పెసరు విజయ్‌చెందర్ రెడ్డి, గట్టికొప్పుల రాంబాబు, నాయకులు పాల్గొన్నారు.

వారోత్సవాలను విజయవంతం చేయాలి



నెహ్రూసెంటర్: సామాజిక న్యాయ వారోత్సవాలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశం సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు అధ్యక్షతన సంఘ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా కుంట ఉపేందర్ మాట్లాడుతూ.. సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు బిటి రణదీవే వర్ధంతి ఈనెల 6వ తేదీ నుంచి ఈ నెల 14వ తేదీ అంబేడ్కర్ జయంతి వరకు సామాజిక న్యాయ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వారోత్సవాల్లో కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సమ్మెట రాజమౌళి, నాగన్న, మౌనిక, సరోజ, మల్లేష్, వెంకన్న, ఉప్పలయ్య, శ్రీను సుధాకర్, స్నేహబిందు, తదితరులు పాల్గొన్నారు.

ఉపకాల్వలపై పట్టింపేది?

- అనుమతులు లేకుండానే అక్రమ నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు



కాల్వపై నిర్మించిన గ్రిల్స్, బ్రిడ్జి

నర్సంపేట రూరల్: ఎస్సారెస్పీ ఉపకాల్వకు సంబంధించిన భూమిని యథేచ్ఛగా ఆక్రమించి నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. నర్సంపేట పట్టణంలోని మహేశ్వరం గ్రామ రెవెన్యూ శివారులో రెండు ఎకరాల భూమిని నర్సంపేట - వరంగల్ ప్రధాన రహదారిపై ఓ వ్యక్తి కొనుగోలు చేశారు. ఆ భూమి మధ్యలో నుంచి ఎస్సారెస్పీ డీబీఎం 40 ఉప కాల్వ వెళ్లింది. కాల్వ సగం నుంచి రెండు వైపుల 14 మీటర్ల భూమిని రైతుల వద్ద నుంచి ప్రభుత్వం తీసుకొని గతంలోనే కాల్వ నిర్మాణం చేపట్టింది. అయితే ఎస్సారెస్పీ నీరు సరిగా రాకపోవడంతో ఇదే అదనుగా భావించిన కొంత మంది వ్యక్తులు ఈ కాల్వను ఆక్రమించుకొని అక్రమ నిర్మాణాలు చేపట్టారు. కాల్వ వెనకాల ఉన్న భూమిలోకి వెళ్లాలంటే చుట్టూ తిరిగి వెళ్లాలి. అలా కాకుండా కాల్వ మధ్యలో పైప్‌లు వేసి బ్రిడ్జి నిర్మించి, కాల్వ పొడవునా సీసీతో కాంక్రీట్ చేయించారు. అలాగే అనుమతులు లేకుండా ఫంక్షన్ హాల్ నిర్మాణం చేస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి ఫంక్షన్ హాల్‌ను కూల్చడమే కాకుండా భూమిని ఆక్రమించుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పనులు నిలిపేశాం..



మహేశ్వరం రెవెన్యూ శివారులోని రాములనాయక్‌తండా గ్రామపంచాయతీ పరిధిలో ఓ వైద్యుడు మినీ ఫంక్షన్‌హాల్ నిర్మిస్తున్న విషయం వాస్తవమే. రాష్ట్ర ప్రభుత్వం అన్ని పర్మిషన్లు ఆన్‌లైన్‌లో తీసుకోవాలని నిబంధనలు ఉన్నప్పటికి, అలాంటి పర్మిషన్లు తీసుకోకుండానే పనులను చేపట్టారు. ఈ పనులను పరిశీలించి వెంటనే నిలిపేయాలని సదరు వ్యక్తికి సూచించడమేకాకుండా నోటీసులు అందించాం.

సునీల్‌కుమార్ రాజ్, ఎంపీఓ, నర్సంపేట

చర్యలు తీసుకుంటాం..

నర్సంపేట మండలంలోని మహేశ్వరం రెవెన్యూ గ్రామ శివారులో ఎస్సారెస్పీ కాల్వ డీబీఎం 40 ఉప కాల్వ భూమిని ఆక్రమించుకొని సీసీ పోసి, గ్రీల్స్ వేసిన విషయం మా దృష్టికి వచ్చింది. దీంతో కాల్వను పరిశీలించి నోటీసులు అందించాం.

-సంతోష్, ఎస్సారెస్పీ డీఈ

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేశ్

వరంగల్ (పర్వతగిరి): మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ సూచించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మండల సమన్వయ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న పనులపై గ్రామాల వారీగా సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లూనావత్ కమలపంతులు, జెడ్పీటీసీ భానోతు సింగ్‌లాల్, వైస్ ఎంపీపీ ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, సర్వర్, ఏకాంతంగౌడ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని కమ్మలకుంటతండాకు చెందిన భానోతు బాలాజీ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ క్రియాశీల సభ్యత్వం తీసుకున్న బాలాజీకి పార్టీ సభ్యత్వం ద్వారా మంజూరైన రూ.2 లక్షల పార్టీ ఇన్సూరెన్స్ చెక్కును శుక్రవారం ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం మరికొంత మందికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను అందించారు.

పేదలకు అండగా ప్రభుత్వం

వర్ధన్నపేట: ప్రభుత్వం పేద ప్రజలకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఉప్పరిపల్లి గ్రామంలో ఎమ్మెల్యే అరూరి ఇంటింటికి వెళ్లి చెక్కుల పంపిణీ చేశారు. పసునూరి శంకరయ్య విద్యుత్ షాక్‌తో మృతిచెందగా విద్యుత్ శాఖ ద్వారా మంజూరైన రూ. 5 లక్షల విలువగల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, సర్పంచ్, నాయకులు పాల్గొన్నారు.

'కేఎంటీపీ'కి అంబేడ్కర్ పేరు పెట్టాలి



కేఎంటీపీని సందర్శించిన నాయకులు

గీసుకొండ: జిల్లాలోని గీసుకొండ-సంగెం మండలాల పరిధిలో ఏర్పాటు చేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (కేఎంటీపీ)కు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ పేరు పెట్టాలని, భూములు ఇచ్చిన రైతులకు ఇచ్చే వంద గజాల ఇంటి స్థలాల ప్రాంతానికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టాలని కాంగ్రెస్ పరకాల నియోజకవర్గ ఇంచార్జి ఇనగాల వెంకట్రాంరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం గీసుకొండ, సంగెం మండలాల కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి కేఎంటీపీలో ఏర్పాటు చేస్తున్న వస్త్ర పరిశ్రమల యూనిట్లను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ పిల్లల దుస్తులు తయారు చేసే కై టెక్స్ కంపెనీలో కేరళ తరహాలో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని, ప్లాస్టిక్ బాటిళ్ల నుంచి పాలియిస్టర్ చిప్స్, యార్న్ తయారు చే సే క్రమంలో కాలుష్యం ప్రబలకుండా పర్యావరణ పరిరక్షణకు తగిన ఏర్పాట్లను ప్రభుత్వం చేయాలన్నారు. కార్మిక చట్టం ప్రకారం కంపెనీలు ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనంతో పాటు రోజుకు 9 గంటల విరామం, మహిళలకు ప్రసూతి బెనిఫిట్ కింద ఆరు నెలల పూర్తి వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. శాయంపేట ఎంపీటీసీ కాయిత భిక్షపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సీనియర్ నాయకులు చాడ కొమురారెడ్డి, దుపాకి సంతోష్, కొండేటి కొమురారెడ్డి, సాయిలి ప్రభాకర్ , దౌడు భరత్, వజ్ర రాజు, నాగారపు స్వామి, మాధవరెడ్డి, కట్టయ్య పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయానికి మైక్‌సెట్ అందజేత

నర్సంపేట: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఖానాపురం మండలం మనుబోతులగడ్డ గ్రామంలోని హనుమాన్ ఆలయానికి శుక్రవారం నర్సంపేట నియోజకవర్గ బీజేపీ నాయకుడు డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి మైక్ సెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పట్టణంలో జరిగిన సమావేశంలో రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ హనుమాన్ భక్తుల కోరిక మేరకు గ్రామంలోని ఆలయానికి మైక్ సెట్‌ను అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయస్వామి భక్తులు, ఖానాపురం మండల బీజేపీ అధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్, యువమోర్చా మండల ప్రధాన కార్యదర్శి ఎద్దు రాజు, గ్రామ పార్టీ కార్యదర్శి రాజబోయిన వెంకటేష్, ఉపాధ్యక్షుడు మంచ వెంకన్న, యూత్ అధ్యక్షుడు ఆబోతు మహేందర్, కాసర్ల శీను, కొరివి రాజు, తదితరులు పాల్గొన్నారు.

'విద్యలో మితిమీరిన రాజకీయ జోక్యం'

మహబూబాబాద్ అర్బన్: పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణలోకి కూడా రాజకీయాలు చొచ్చుకొని రావడం తీవ్ర ఆందోళన కలిగిస్తుందని టపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిద్ధోజు కవిత అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం మాట్లాడారు. సమావేశంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం, డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్, కృష్ణమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే ప్రజా సంక్షేమం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

సంగెం: దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా అభివృద్ధి చెందుతూ అన్ని రంగాల్లో ప్రజా సంక్షేమం అందిస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మాపూర్, ఎల్గూర్‌రంగంపేట, తీగరాజుపల్లి, నర్సానగర్, ఎల్గూర్‌స్టేషన్ గాంధీనగర్, కొత్తగూడెం తదితర గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులతో పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పేదలందరిని ఆదుకోవడమే లక్ష్యంగా పథకాలను అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సారంగపాణి, సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు సాగర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల్లో క్రైస్తవులు గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. పలు చర్చిల్లో సంఘ కాపరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సర్వ పాప పరిహారం కోసం యేసు బోధనలు ఆచరణీమన్నారు. సమస్త మానవాళి పాపములను క్షమించేది ఏసుక్రీస్తు మాత్రమే అన్నారు. సమస్త మానవాళి పట్ల ప్రేమ, అవధులు లేని త్యాగం, సడలని ఓర్పు, శత్రువుల పట్ల క్షమా గుణం అనే గొప్ప లక్షణాలు కలిగిన కరుణామయుడు ఏసుక్రీస్తని పాస్టర్లు కొనియాడారు.

-సాక్షి నెట్‌వర్క్



నల్లబెల్లి: మాట్లాడుతున్న పాస్టర్ రెవ ఈవీ ప్రసాద్



వర్ధన్నపేట: ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు



నెక్కొండ: ఏసుక్రీస్తు బోధనలను వివరిస్తున్న బాబురావు

బీసీలకు బీజేపీ పెద్దపీట



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

వర్ధన్నపేట: ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బీసీలను ముందంజలో ఉంచడానికి దేశంలోని బీజేపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మండల పార్టీ అధ్యక్షుడు రాయపురం కుమారస్వామి అన్నారు. శుక్రవారం బీజేపీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు కత్తి వెంకన్న చెన్నారం గ్రామంలో పల్లె పల్లెకు ఓబీసీ.. ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఓబీసీ మోర్చా పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ఓబీసీ మోర్చా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకన్న ఆయన మాట్లాడుతూ బీసీలకు న్యాయం చేయడానికి బీజేపీ ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందన్నారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జడ సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దూరి రాజ్‌కుమార్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ కుందూరు మహేందర్ రెడ్డి, నాయకులు సిందం శ్రీనివాస్, పెండ్యాల రాకేష్, అమరరాజు సమ్మయ్య, భిక్షపతి పాల్గొన్నారు.

మాలలు రాజకీయంగా ఎదగాలి



మాట్లాడుతున్న జిల్లా నాయకులు

గూడూరు: మాలలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గుర్రాల లింగయ్య, ప్రధాన కార్యదర్శి బెజ్జం రమేష్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం మండల మాల మహానాడు అధ్యక్షుడు చీదురు హరీశ్ అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 11న నెల్లికుదురు మండల కేంద్రంలోని అమూల్య గార్డెన్స్‌లో మాలల ఆత్మగౌరవ సమ్మేళనం సభ జరుగుతుందని తెలిపారు. మాలలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు యాకాంతం, వీరన్న, వెంకన్న, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

'బలగం' సినిమా ప్రదర్శన




నారక్కపేటలో బలగం సినిమా చూస్తున్న గ్రామస్తులు

నల్లబెల్లి/గీసుకొండ: తెలంగాణ యాసలో, గ్రామీణ నేపథ్యం కలిగిన బలగం సినిమా పల్లె ప్రజలకు గట్టిగా కనెక్ట్ అవుతుంది. బలగం సినిమా ప్రస్తుతం పల్లెల్లో ప్రధాన కూడల్లో ప్రొజెక్టర్లు, ఎల్ఈడీ స్క్రీన్లపై ప్రదర్శిస్తున్నారు. గురువారం రాత్రి మండలంలోని నారక్కపేటలో సర్పంచ్ వక్కల మల్లమ్మ, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షురాలు బోళ్ల శ్రీలత , 16వ డివిజన్ ధర్మారంలో కార్పొరేటర్ సుంకరిమనీషా శివకుమార్ ఆధ్వర్యంలో బలగం సినిమాను ప్రదర్శించారు.



ధర్మారంలో..

మైనార్టీల సంక్షేమానికి కృషి



పండ్లు తినిపిస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్



గీసుకొండలో ఇఫ్తార్ విందు

వర్ధన్నపేట: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని ఎమ్మెల్యే రమేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఇల్లంద గ్రామంలో మహమ్మద్ చోటే భాయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని కులాల, మతాల పండుగలకు సమ ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, జెడ్పీటీసీ భిక్షపతి, పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్ ఖన్నా, మండల పార్టీ అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, సర్పంచ్ సుంకరి సాంబయ్య, ఎంపీటీసీ శ్రీనివాస్, సర్పంచ్ సంపత్‌రెడ్డి, నాయకులు, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

గీసుకొండలో ఇఫ్తార్ విందు

గీసుకొండ: గీసుకొండ మండల కేంద్రంలోని మసీదులో ముస్లింలకు ఇఫ్తార్ విందును శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేశారు. రిటైర్డ్ స్టేట్ బ్యాంకు మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మినారాయణ, సర్పంచ్ దౌడు బాబు, కర్ణకంటి రాంమూర్తి, ముస్లిం సోదరులు పాల్గొని మతసామరస్యాన్ని చాటారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

నెల్లికుదురు: అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు పరిరక్షించాలని సీపీఎం మండల కార్యదర్శి పెరుమాండ్ల తిలక్ బాబు కోరారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమిలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో 317 సర్వే నంబర్‌లో గుడిసెలు నిర్మించే ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి ఇస్సంపల్లి సైదులు, తోట నర్సయ్య, పుల్లయ్య, భిక్షపతి, వీరేంకులు, భిక్షపతి, ఉప్పలయ్య, యాకయ్య, రాజు, అశోక్, రామ్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణం

రాయపర్తి: యాభై ఏళ్లుగా కాలినడకన కూడా వెళ్లలేని దుస్థితుల్లో రవాణా సౌకర్యాల పరంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న టీకులగూడెం గిరిజనుల స్వప్నం సాకారం కానుంది. పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సహకారంతో రూ.90 లక్షలతో బాలాజీతండా గ్రామ పంచాయతీ పరిధి టీకులగూడెంకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కాగా రవాణా సౌకర్యాల మెరుగు కోసం కావాల్సిన స్థల సేకరణ కోసం తండావాసులు స్వచ్ఛందగా రూ. 8 లక్షల విరాళాలు సేకరించడం వారి ఇబ్బందులకు నిదర్శనం ఈ సందర్భంగా సర్పంచ్ అజ్మీర్ కౌసల్య హనుమా మాట్లాడుతూ ఎన్నో ఇబ్బందులకు గురవుతూ తండా నుంచి వేరే గ్రామానికి వెళ్లే వారమని, మాకు ఉన్న ప్రధాన సమస్య తీర్చడంలో మంత్రి దయాకర్‌రావు కృషికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు అజ్మీర సరిత శ్రీనివాస్, అజ్మీర్ యాకూబ్, కిషన్, హరిసింగ్, వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.